## డెవలప్మెంట్ పేరుతో 5 ఎకరాల పైచిలుకు భూమిని తన సొంత బంధువు తీసుకొని 80 లక్షలు ఇస్తానని చెప్పి ఇంతవరకు డబ్బులు ఇవ్వడం లేదని బాధితురాలు వాణి తెలిపారు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 11 :** బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాని మాట్లాడుతూ తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని చెప్పారు తన తమ్ముడు వరుసైన భూమి తీసుకుని 80 లక్షలు డబ్బులు ఇస్తానని నమ్మవలసి మోసం చేస్తున్నారని ఆరోపించారు తాను సూసైడ్ చేసుకోవడం జరిగిందని, అయినా తమ్ముడు వరసైన వ్యక్తి స్పందించడం లేదని ఆమె తన గోడు వెళ్లబుచ్చుతూ పాత్రికేయులకు పూర్తి వివరాలు వెల్లడించారు భువనగిరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని, కోర్టులో కేసు వేసినా పట్టించుకోవడంలేదని ఆమె తన ఆవేదన వ్యక్తం చేశారు తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని ఆమె వెల్లడించారు తన అల్లుడు చల్ల సాయికుమార్ మాట్లాడుతూ మా అత్త వాణికి న్యాయం జరిగే చేయాలని ఆయన పాత్రికేయులను కోరారు మానవతా దృక్పథంతో వానికి చెందవలసిన డబ్బులు చెల్లించాలని తన అత్త బంధువులకు విజ్ఞప్తి చేశారు

## ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 11. :** ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్లిగాంధీభవన్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు వింత వికృత రాజకీయాలు చేస్తుందని విమర్శించారు కేటీఆర్ సోషల్ మీడియా పనికట్టుకుని పనికి రాని ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు బీజేపీ పార్టీ యొక్క క్రాస్ బిడ్ డిఎన్ఏ నే తెలంగాణగా లో బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు దేశం అంత మీనాక్షి నటరాజన్ కి సపోర్ట్ చేస్తుంటే బీఆర్ఎస్ మాత్రం బీజేపీ కి సపోర్ట్ చేస్తుందని విమర్శించారు రేవంత్ రెడ్డి ని టార్గెట్ చేసి కేటీఆర్ సోషల్ మీడియా ప్రచారం చేస్తుందని, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ లు గా పనిచేసిన వారు గొప్ప స్థానాల్లో ఉన్నారు దేశ వ్యాప్తంగా మీనాక్షి నటరాజన్ కి రాజ్య సభ వస్తే ఫస్ట్ హ్యాపీ గా ఉండేది రేవంత్ రెడ్డి ఒక మహిళకి అన్యాయం జరిగితే ఇష్టం వచ్చినట్టు ప్రచారాలు చేస్తున్నారు బీఆర్ఎస్ నాయకులు సొంత చెల్లి కే అన్యాయం చేసిన కేటీఆర్ కి బయట మహిళా మేధ సానుభూతి ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు ఒక మహిళని బీజేపీ రాజకీయ ఇబ్బందులకు గురి చేస్తుంటే కనీసం సానుభూతి లేదు బీఆర్ ఎస్ నాయకులకు ఈసీ కూడా బీజేపీ కి ప్రధాన అనుబంధ సంస్థ గా పనిచేస్తుందని తెలిపారు గతం లో ఓట్లు చోరీ చేసింది బీజేపీ ఇప్పుడు సీట్లు చోరీ చేస్తుంది బీజేపీ కి దేశం లో రాజకీయ భవిష్యత్ ఉండదని ఆయన పేర్కొన్నారు ప్రజలు బీజేపీ దుర్మార్గపు పాలన చూస్తున్నారు అని ఆయన తెలిపారు

## నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ .




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 11. :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని రహమత్నగర్ డివిజన్ హెచ్.ఎఫ్. నగర్లో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పనులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ గారు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈ పనులు చేపట్టడం జరుగుతోందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు..

## భద్రాచలంలో లాడ్జీలు, బస్టాండ్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 11 (వార్త సంధ్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు భద్రాచలం పట్టణంలోని లాడ్జీలు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించడమే లక్ష్యంగా ఈ సోదాలు చేపట్టినట్లు డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు. రాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 5.00 గంటల వరకు కొనసాగిన ఈ ప్రత్యేక తనిఖీల్లో భద్రాచలం పట్టణంలోని మొత్తం 62 లాడ్జీలను పోలీసులు పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ పరికరాలు, డాగ్ స్క్వాడ్ బృందాల సహాయంతో లాడ్జీల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా లాడ్జీల యజమానులు, మేనేజర్లు, సిబ్బంది వివరాలను నమోదు చేసి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్ కనీసం రెండు నెలల పాటు భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే లాడ్జీల వెలుపల రహదారిపై వాహనాల రాకపోకలు స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమెరాలను రోడ్డు వైపు అమర్చాలని ఆదేశించారు. పట్టణ ప్రజల భద్రత, నేర నియంత్రణ దృష్ట్యా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీఎస్పీ పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో భద్రాచలం టౌన్ సీఐ మడిపల్లి నాగరాజు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం సోనోవిజన్ షాపులో భారీ చోరీ

### కీలక ఆధారాలు, వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 11 (వార్త సంధ్య) :** ఖమ్మం నగరంలోని ప్రముఖ మొబైల్ విక్రయ కేంద్రం సోనోవిజన్ షోరూమ్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘట నకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుని నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయాలని పోలీ సు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం గుర్తుతెలియని దుండ గులు షాపు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం స్టాక్‌రూమ్‌లో భద్రపరిచిన విలు వైన అధునాతన మొబైల్ ఫోన్లను అపహరించినట్లు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీకి సంబం ధించిన ఆధారాల కోసం క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర సాంకేతిక ఆధారా లను సేకరిస్తోంది. అలాగే షోరూమ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీ లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుల కదలికలను గుర్తించే దిశగా ప్రత్యేక బృం దాలు పని చేస్తున్నట్లు సమాచారం. ఘటనా స్థల పరిశీలనలో పోలీస్ కమిషనర్ వెంట ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, క్లూస్ టీమ్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 74 జీవోను అమలు చేయాలి




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 11 :** పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు ఎస్ బాబు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ క్రీడాకారుల తరఫున ప్రభుత్వానికి ఈ ముఖ్యమైన డిమాండ్లు మంత్రి కి అధికారులకు భిన్న వినతి పత్రం అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు . పారా క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలలో పూర్తి అర్హత తెలంగాణ హైకోర్టు కూడా పారా అథ్లెట్లు స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలకు అర్హులేనని స్పష్టం చేసిందని తెలిపారు. పారా క్రీడాకారులను సాధారణ క్రీడాకారులతో సమానంగా గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి కోరారు జీవో. 74 అమలులో స్పష్టత జీవో. 74 ప్రకారం క్రీడాకారులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించబడింది. అయితే పారా క్రీడాకారుల సర్టిఫికెట్లను కూడా సమానంగా పరిగణించేలా ప్రత్యేక మార్గదర్శకాలు ఇవ్వాలి. ఆయన విజ్ఞప్తి చేశారు 3 పారా స్పోర్ట్స్‌కు ప్రత్యేక ఉద్యోగ రోస్టర్ ప్రతి ప్రభుత్వ శాఖలో పారా క్రీడాకారుల కోసం ప్రత్యేక రోస్టర్ పాయింట్లు కేటాయించాలని కోరారు అంతర్జాతీయ పారా క్రీడాకారులకు ప్రత్యక్ష నియామకాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పారా క్రీడాకారులకు గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల్లో ప్రత్యక్ష నియామకాలు ఇవ్వాలి. అని డిమాండ్ చేశారు నగదు ప్రోత్సాహకాలు సమానంగా ఇవ్వాలని, పారా ఒలింపిక్స్, ఆసియన్ పారా గేమ్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ పతక విజేతలకు ఒలింపిక్ క్రీడాకారులతో సమాన నగదు బహుమతులు ఇవ్వాలి డిమాండ్ చేశారు జిల్లా స్థాయిలో పారా స్పోర్ట్స్ అకాడమీలు ప్రతి జిల్లాలో పారా క్రీడాకారుల శిక్షణ కేంద్రాలు, కోచ్‌లు, పరికరాలు ఏర్పాటు చేయాలని, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత స్పోర్ట్స్ కోటా ఎంపికల జాబితాలు, మార్కులు, అర్హత ప్రమాణాలు బహిరంగంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు పారా క్రీడాకారులకు నెలవారీ పెన్షన్ అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించిన పారా క్రీడాకారులకు నెలవారీ గౌరవ వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వ భూములు / ఇళ్ల స్థలాలు పారా ఒలింపియన్లు అంతర్జాతీయ పతక విజేతలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. 1శీ ముఖ్య నినాదం "పారా క్రీడాకారులకు సమాన హక్కులు -- సమాన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు ఈ సమావేశంలో పార క్రీడాకారులు బాబు చారి, సైదులు, కృష్ణవేణి, ఎస్పీ బాబు, సంజీవయ్య, డి మహేష్, ప్రశాంత్, రాజు, కళ్యాణ్, కోటేశ్వర్, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ సమీరా రాహుల్ బి రవి నవనీత తదితరులు పాల్గొన్నారు జీవో 74 కింద పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలి. పారా క్రీడాకారులను స్పోర్ట్స్ కోటాలో పూర్తి స్థాయిలో గుర్తించి ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని మేము డిమాండ్ చేస్తున్నాము."

## ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్ రెడ్డి

- 150 రోజుల్లో ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయం ప్రారంభం
- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావడమే లక్ష్యం
- చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపుపై ప్రభుత్వం కట్టుబాటు
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు తిరస్కరిస్తారని వ్యాఖ్య




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)జూన్ 11 :** రేపటి భవిష్యత్తుకు ఈ రోజే పునాదులు వేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే నగరంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, ఫ్యూచర్ సిటీ పరిధిలోని ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఎంపికైన కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులకు లెటర్స్ ఆఫ్ అవార్డు అందజేశారు. అనంతరం ఫ్యూచర్ సిటీ పరిధిలోకి కొన్ని గ్రామాలను చేర్చే ప్రక్రియకు సంబంధించిన



పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని, రెండు శతాబ్దాల క్రితం నగర విస్తరణతో హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాలుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయంలో సుమారు 60 శాతం వాటా హైదరాబాద్ నుంచే వస్తోందని తెలిపారు. 1908 మూసీ వరదల తర్వాత అప్పటి పాలకులు నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టారని, అనంతరం హైటెక్ సిటీ, అవుటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయం, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా నిలబెట్టాయని గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టులను కూడా గతంలో కొందరు వ్యతిరేకించి నప్పటికీ, అవే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయని అన్నారు. ఫ్యూచర్ సిటీ కూడా తెలంగాణ భవిష్యత్తును నిర్దేశించే



మహత్తర ప్రాజెక్టుగా నిలుస్తుందని సీఎం స్పష్టం చేశారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రపంచంలోని ప్రముఖ గ్రీన్ ఫార్మా, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఐటీ సంస్థలు, అలాగే ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆకర్షించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మరో అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వర్షాకాలంలో ఎదురవుతున్న సమస్యలకు చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలే ప్రధాన కారణమని సీఎం పేర్కొన్నారు. అందుకే ఆక్రమణల తొలగింపు, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అమలు చేస్తోందన్నారు. రాజేంద్రనగర్, కూకట్‌పల్లి నల్లచెరువు, అంబర్‌పేట బతుకమ్మకుంట వంటి ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రపంచంలోని ఇతర మహానగరాలు ట్రాఫిక్, వరదలు, మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని, హైదరాబాద్‌ను కాలుష్యరహిత, ప్రణాళికాబద్ధ, సుస్థిర అభివృద్ధి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు సమర్థంగా తిప్పికొడతారని, తెలంగాణ భవిష్యత్తుకు ఈ ప్రాజెక్టు ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో గ్యాస్ 'బ్లాక్' దందా

- ఏజెన్సీలతో కుమ్మక్కై దళారుల అక్రమ వసూళ్లు
- రూ.3000కు చేరిన సిలిండర్ ధర..
- నిమ్మకు నీరెత్తిన అధికారులు!
- అమాయక గిరిజనులే లక్ష్యం..
- సామాన్యుల జేబులకు చిల్లు
- అక్రమ నిల్వలపై చర్యలు శూన్యం..
- సివిల్ సప్లై అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 11 (వార్త సంధ్య) :** అన్నపురెడ్డిపల్లి మండలంలో వంట గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ దందా యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ నియంత్రిత ధరలకు అందాల్సిన గ్యాస్ సిలిండర్లు కొందరు దళారుల చేతుల్లో బంగారు గుడ్లు పెట్టే వ్యాపారంగా మారిపోయాయి. ముఖ్యంగా మండలంలోని గిరిజన గ్రామాలు, మారుమూల ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంట గ్యాస్ అవసరం ప్రతి కుటుంబానికి తప్పనిసరి కావడంతో ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమ వ్యాపారులు గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో సాధారణ ధర కంటే అనేక రెట్లు అధికంగా రూ.2300 నుంచి రూ.3000 వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. పేద గిరిజన కుటుంబాలు, రోజువారీ కూలీలు, వ్యవసాయ కార్మికులు ఈ భారాన్ని భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### గ్యాస్ ఏజెన్సీలతో కుమ్మక్కు ఆరోపణలు :

స్థానికంగా సాగుతున్న ఈ అక్రమ దందా వెనుక కొందరు గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు లేదా మధ్యవర్తుల పాత్ర కూడా ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా బుక్ చేసిన సిలిండర్లు సకాలంలో వినియోగదారులకు అందకపోవడం, అదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు సిలిండర్లు అందుబాటులో ఉండటం పలు ప్రశ్నలకు తావిస్తోంది. గ్యాస్ సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు లాభాలు ఆర్జిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.




అక్రమ నిల్వలపై నిద్రపోతున్న అధికారులు :

గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ సివిల్ సప్లై శాఖ అధికారులు ఇప్పటివరకు పెద్దగా స్పందించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో ఎక్కడెక్కడ సిలిండర్లు నిల్వ ఉంచుతున్నారనే సమాచారం స్థానికులకు తెలిసినా అధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. అక్రమంగా పెద్ద ఎత్తున గ్యాస్ సిలిండర్లను నిల్వ చేయడం కేవలం చట్టవిరుద్ధమే కాక ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

### గిరిజనులపై పెరుగుతున్న ఆర్థిక భారం :

మారుమూల గ్రామాల్లో నివసించే గిరిజనులు గ్యాస్ సిలిండర్ కోసం దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ధరకు అందాల్సిన సిలిండర్ కోసం వేల రూపాయలు అదనంగా చెల్లించాల్సి రావడంతో కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. కొన్ని కుటుంబాలు అధిక ధరల కారణంగా తిరిగి కట్టెల పొయ్యిల వైపు మొగ్గుచూపుతున్న పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజల డిమాండ్ ఇదే... :

అన్నపురెడ్డిపల్లి మండలంలో సాగుతున్న గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందాపై జిల్లా యంత్రాంగం వెంటనే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిల్వ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి సిలిండర్లను స్వాధీనం చేసుకోవాలని, దందాకు పాల్పడుతున్న దళారులు, సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్యాస్ ఏజెన్సీల సరఫరా విధానంపై ప్రత్యేక విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### చర్యలు ఎప్పుడు..? :

మండలంలో బహిరంగ రహస్యంగా మారిన ఈ అక్రమ గ్యాస్ దందాపై సివిల్ సప్లై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? గిరిజనులను దోచుకుంటున్న బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై ఎప్పుడు ఉక్కుపాదం మోపుతారు? అనే ప్రశ్నలు ప్రస్తుతం ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని అన్నపురెడ్డిపల్లి ప్రజలు కోరుతున్నారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



# యుద్ధప్రాతిపదికన తాగునీటి సరఫరా పునరుద్ధరణ

## ప్రజలకు తప్పిన తాగునీటి ఇబ్బందులు కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్





భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 11 (వార్త సంధ్య) : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని యుద్ధప్రాతిపదికన పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29 డివిజన్లకు తాగునీరు అందించే ఇల్లందు క్రాస్‌రోడ్డు ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న మేయర్ గణేష్ వెంటనే ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించడంతో పాటు మరమ్మతు పనులను పర్యవేక్షించారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఖమ్మం నుంచి తాత్కాలికంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి ఏర్పాటు చేయడం ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రస్తుతం దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు కొనసాగుతున్నాయని, త్వరలోనే దానిని తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎమ్మెల్యే కూనంనేని కృషితో కొత్తగూడెం కార్పొరేషన్‌కు అమృత్ పథకం కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో చేపడుతున్న నీటి పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అవి పూర్తయితే తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జేఎన్టీయూ వీసీ నీ వెంటనే తొలగించాలి

## : స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం డిమాండ్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) వైస్ ఛాన్సలర్ టీకేకే రెడ్డి ప్రవర్తనపై స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా, అధికారులు, సెక్యూరిటీ సిబ్బందిపై అసభ్య పదజాలంతో దూషిస్తున్న వీసీని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఫోరం ఆధ్వర్యంలో గురువారం వీసీ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు జవ్వాజి దిలీప్, రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. వీసీ తీరు వల్ల విశ్వవిద్యాలయం రోజురోజుకూ గందరగోళంలోకి నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలను మనసులో పెట్టుకుని, ఐడీ కార్డులు ఉన్న విద్యార్థులను సైతం వర్సిటీలోకి రానివ్వకుండా మౌఖిక ఆదేశాలు ఇవ్వడం వీసీ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యంగా దళిత, గిరిజన విద్యార్థుల పట్ల ఆయన కుట్రపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. తమను కలవడానికి వచ్చే విద్యార్థులను కలవకుండా, గేటు వద్దకు వెళ్లి ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులైన సెక్యూరిటీ సూపర్‌వైజర్లను సైతం అత్యంత దారుణమైన బూతులు తిడుతూ బెదిరించడం వీసీ స్థాయికి సిగ్గుచేటు. ఆయన వేధింపులు, అసభ్య ప్రవర్తన భరించలేక తోటి ఉన్నతాధికారులు కూడా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు," అని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు.విద్యార్థులకు సమయం ఇవ్వలేని పక్షంలో వీసీ తక్షణమే రాజీనామా చేసి వెళ్లిపోవాలని వారు హితవు పలికారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించి టీకేకే రెడ్డిని వీసీ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన స్థానంలో విద్యార్థుల పట్ల గౌరవప్రదంగా మెలిగే, అందరినీ సమానంగా చూసే సమర్థుడైన వ్యక్తిని నియమించి విద్యార్థుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాగర్ నాయక్, దుర్గాప్రసాద్, సుజయ్, శ్రీనికేతన్, ఆనంద్, ఆదిత్య, చక్రవర్తి, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో పేరిణి రాజ్ కుమార్, ఉత్సాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహిత బృందం అలరింప జేసిన సాంప్రదాయ పేరిణి నాట్య ప్రదర్శన కార్యక్రమం




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 11 :** తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 72వ రోజు నిర్వహించిన కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. "పాల్కురికి సోమన్న మూల" వేదికపై జూన్ 11, 2026న పేరిణి రాజ్ కుమార్, బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహిత, వేసవి సెలవులో నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం బృందం అత్యంత వైభవంగా చేసిన సాంప్రదాయ పేరిణి నాట్య ప్రదర్శన కార్యక్రమం అత్యంత వైభవంగా " చేసినారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఫోన్లకు, టీవీలకు పరిమితం కాకుండ మన చారిత్రాత్మక పెరిణి నృత్యాన్ని నేర్చుకోవడం అభినందనీయం. కాకతీయుల కాలం నాటి ఈ వీర నృత్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించడానికి ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎంతో అవసరం. శిక్షణ పొంది, ఈరోజు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు, వారికి నేర్పిన గురువులకు ప్రత్యేక అభినందనలు."

### గురువులు:కస్తూరి, చందన ప్రమద ఉ పి ఆర్ కె టీం

సాంప్రదాయ పెరిణి నాట్యం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్ సాంస్కృతిక శాఖ సలహాదారులు దినకర్ పల్లె నర్సింహాలిఒగ్గు రవి పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలతో సభను ఉత్సాహపరిచారు కళాకారులు.

# ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం

## : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాజెక్టులపై జలసౌధలో ఉన్నతస్థాయి సమీక్ష
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ
- సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం
- భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం



హైదరాబాద్, జూన్ 11 (వార్త సంధ్య): ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ ఎర్రమంజిల్ జలసౌధలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించేందుకు పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతమ్మసాగర్ ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనాలు అందిస్తామని చెప్పారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల విడుదల వంటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. తారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగ భవిష్యత్తును మార్చగల కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు ఇప్పటికే ఉన్న ఆయకట్టును స్థిరీకరించే అవకాశం కలుగుతుందని వివరించారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి విస్తరణ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అత్యంత ప్రాధాన్య అంశాలని మంత్రి స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం అవసరమైన ప్రతి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# ఆలయ పూజారుల హక్కుల కోసం కుమ్మర్ల పోరాటం..

# డిండి రహదారిపై భారీ ఆందోళన



**నాగర్‌కర్నూల్, :జూన్- 11 (వార్త సంధ్య):** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం లత్తిపూర్ గ్రామంలోని శ్రీ కట్ట మైసమ్మ దేవస్థానంలో తరతరాలుగా పూజారులుగా కొనసాగుతున్న కుమ్మర్ల హక్కులను పరిరక్షించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కుమ్మర్లను పక్కనపెట్టి ఇతరులను పూజారులుగా నియమించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ గురువారం భారీ నిరసన దీక్ష చేపట్టింది. డిండి ప్రాజెక్టు సమీపంలోని కట్ట మైసమ్మ తల్లి ఆలయం వద్ద రాష్ట్ర కుమ్మర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో కుమ్మరి కుటుంబాలు, మహిళలు, సంఘ నాయకులు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం వద్ద దీక్ష చేపట్టి, తరువాత ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడిన వెంకటేశం, 1947 సంవత్సరం నుంచి కుమ్మరి వర్గానికి చెందిన కుటుంబాలే ఆలయంలో పూజారులుగా



సేవలందిస్తున్నాయని తెలిపారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణలో కుమ్మర్ల పాత్ర కీలకమైందని, అమ్మవారి సేవను తరతరాలుగా కొనసాగిస్తున్న కుటుంబాలను ఇప్పుడు పూజారిత్వం నుంచి దూరం చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల ఆలయం ఎండోమెంట్స్ శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత వివాదం ప్రారంభమైందని ఆయన ఆరోపించారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం సంప్రదాయ హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గ్రామదేవత ఆలయాల్లో తరతరాలుగా పూజారులుగా సేవలందిస్తున్న కుమ్మర్ల హక్కులను చట్టపరంగా రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామదేవత ఆలయాల్లో కుమ్మర్లు పూజారులుగా కొనసాగుతున్నారని, ఈ సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, డిండి కట్ట మైసమ్మ ఆలయ వివాదంపై స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, సంప్రదాయ పూజారుల హక్కులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు వెంకటేశం తెలిపారు. ఎమ్మెల్యే సానుకూల స్పందనతో పాటు అధికారులు చర్చలకు సిద్ధమవడంతో నిరసన దీక్షను విరమించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్ రావు, రాష్ట్ర సలహాదారు రాంచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగపూరి నగేష్, సహాయ కార్యదర్శి జిల్లాల శంకరయ్య, ప్రచార కార్యదర్శులు అగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన సుమారు 600 మంది కుమ్మరి సామాజిక వర్గ సభ్యులు నిరసనకు మద్దతు తెలిపారు. కుమ్మర్ల సంప్రదాయ హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని సంఘ నాయకులు స్పష్టం చేశారు.

# రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: కల్వకుంట్ల కవిత

- రైతుల నుంచి రూ.1,200 కోట్ల కప్పం వసూలు చేశారని ఆరోపణ
- రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్ ఎత్తివేసే కుట్ర జరుగుతోందని విమర్శ
- వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలని డిమాండ్
- నల్గొండలో రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం





**నల్గొండ, జూన్ 11 (వార్త సంధ్య):** రాష్ట్రంలోని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. నల్గొండలో నిర్వహించిన రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

వ్యవసాయరంగంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మట్టి తల్లిని అలుసుగా చూస్తూ వ్యవసాయాన్ని కర్మకు వదిలేశారని విమర్శించారు.

### రూ.1,200 కోట్ల కప్పం వసూలు

రాష్ట్రంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కవిత అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, యూరియా సరఫరా, ధాన్యం కొనుగోళ్లు, సాగునీటి విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. క్వింటాల్ ధాన్యానికి 6 కిలోల తరుగు తీస్తూ, రవాణా ఖర్చులను రైతులపైనే మోపుతూ దాదాపు రూ.1,200 కోట్ల మేర రైతుల నుంచి వసూలు చేశారని మండిపడ్డారు. రైతులకు రావాల్సిన బకాయి రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### కౌలు రైతులు, రైతు కూలీలకు సాయం చేయాలి

రాష్ట్రంలో 36 శాతం మంది కౌలు రైతులేనని పేర్కొన్న కవిత, వారిని గుర్తించి రైతు భరోసా అందించాలని కోరారు. రైతు కూలీలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సాయం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### సాగునీటి సమస్యలపై ఆందోళన

నల్గొండ జిల్లాలో సాగునీటి కొరత తీవ్రంగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కొత్త రిజర్వాయర్లు నిర్మించాలని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నల్గొండకు కూడా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిండి ప్రాజెక్టు సోర్స్ పాయింట్ మార్పు ద్వారా నల్గొండ, పాలమూరు జిల్లాల మధ్య వివాదాలకు ముగింపు పలకాలని సూచించారు.

### అసైన్డ్ భూములను కాపాడుకోవాలి

అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పరిశ్రమల పేరుతో వాటిని స్వాధీనం చేసుకుంటోందని కవిత ఆరోపించారు. అసైన్డ్ భూములను రక్షించేందుకు ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### రైతు డిస్కంపై అభ్యంతరం

రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు ప్రభుత్వం "రైతు డిస్కం" పేరుతో కుట్ర చేస్తోందని కవిత ఆరోపించారు. కొత్త డిస్కంను ఏర్పాటు చేసి విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత నియంత్రణ సంస్థలకు అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు.

### వ్యవసాయాన్ని ఎతర్రిశ్రమగా గుర్తించాలి

వ్యవసాయ రంగానికి పరిశ్రమలకు ఇచ్చే అన్ని ప్రోత్సాహకాలు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించి పెట్టుబడులు, మార్కెటింగ్, బ్రాండింగ్, నిల్వ సదుపాయాలు, రుణాల విషయంలో ప్రత్యేక విధానం తీసుకురావాలని కోరారు. జగిత్యాల మామిడి పండ్లకు బ్రాండ్ సృష్టించడం ద్వారా మార్కెట్ అవకాశాలు పెంచిన అనుభవాన్ని గుర్తు చేస్తూ, ప్రతి పంటకు మార్కెట్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

### పది తీర్మానాల ఆమోదం

రౌండ్ టేబుల్ సమావేశంలో పది కీలక తీర్మానాలను ఆమోదించినట్లు కవిత తెలిపారు. వాటిలో రైతు డిస్కం రద్దు, యూరియా యాప్ తొలగింపు, బకాయి రైతు భరోసా చెల్లింపులు, కౌలు రైతులకు గుర్తింపు, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నకిలీ విత్తనాలు, పురుగుమందులపై కఠిన చర్యలు, మూసీ కాలుష్య నివారణ, నిమ్మ-బత్తాయి రైతులకు మద్దతు, పత్తి రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఉన్నాయి.

### రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలు చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రకటిస్తున్న 5 వేల కానిస్టేబుల్ పోస్టులను 20 వేలకు పెంచాలని, ఇతర ఉద్యోగాలకు కూడా వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు.

### జూలై 2న భూపోరాటం

ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన భూముల కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో భారీ భూపోరాటం నిర్వహించనున్నట్లు కవిత ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

### బత్తాయి రైతుల సమస్యలపై పోరాటం

నల్గొండ జిల్లా మాడుగుల మండలం ఇందుగుల గ్రామంలో బత్తాయి తోటలను సందర్శించిన కవిత, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. బత్తాయి, నిమ్మ, పత్తి రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు

- డ్రగ్స్ నియంత్రణకు ఏఐ, డేటా అనలిటిక్స్ వినియోగించాలి
- అంతర్జాతీయ స్థాయి నిఘా వ్యవస్థల అమలుకు చర్యలు
- డ్రగ్స్ ముఠాలపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని ఆదేశం
- ఎక్సైజ్ శాఖ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే కీలక విభాగమని వ్యాఖ్య
- దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్న 117 మంది యువ అధికారులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో , జూన్ 11 (వార్త సంధ్య):** తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. బండ్లగూడ జాగీర్‌లోని తెలంగాణ ఎక్సైజ్ అకాడమీలో గురువారం నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, కొత్తగా విధుల్లోకి అడుగుపెడుతున్న అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆరు నెలల కఠోర శిక్షణను పూర్తి చేసుకున్న 28 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 89 మంది ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 117 మంది అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖ కేవలం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విభాగం మాత్రమే కాదని, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడే సామాజిక బాధ్యత కలిగిన శాఖ అని పేర్కొన్నారు. ఒకప్పుడు నాటుసారా, గుడుంబా, కల్తీ మద్యం ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం గంజాయి, సింథటిక్ డ్రగ్స్, ఆన్‌లైన్ నార్కోటిక్ నెట్‌వర్క్‌లు కొత్త సవాళ్లుగా మారాయని చెప్పారు.

### సాంకేతికతే అతిపెద్ద ఆయుధం

నేటి నేరగాళ్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో అధికారులు కూడా సాంకేతికంగా మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగించాలని పేర్కొన్నారు. డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా గంజాయి సాగు ప్రాంతాలు, అక్రమ సారా కేంద్రాలను గుర్తించడం, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా రవాణాను పర్యవేక్షించడం, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ ద్వారా డ్రగ్ నెట్‌వర్క్‌లను ముందుగానే గుర్తించడం సాధ్యమవుతుందని వివరించారు. తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నిఘా వ్యవస్థలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

### డ్రగ్స్‌పై నిర్దాక్షిణ్య పోరు

రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులు ఎంతటి ప్రభావశీలులైనా చట్టం ముందు మోకరిల్లేలా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

### సౌమ్య త్యాగం స్ఫూర్తిదాయకం

క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, ప్రజాసేవా దృక్పథమే అధికారుల అసలు గుర్తింపుగా ఉండాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన సౌమ్య ధైర్యసాహసాలు కొత్త అధికారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖురేషీ, సురేష్, అంజన్‌రావు, శశిధర్ రెడ్డి, రంగారెడ్డి తదితర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

